

వలిసె శోభ

వలిసె పూల అందాలు కనువిందు చేస్తున్నాయి. మత్స్యగెడ్డ పరివాహక ప్రాంతంలో పసుపు పచ్చని తివాచీని తలపిస్తూ పర్యాటకులను అమితంగా ఆకర్షిస్తున్నాయి. కొండవాలు ప్రాంతాల్లో కూడా సాగు చేయడంతో స్వర్ణ కాంతులతో ప్రకృతికాంతకు మరింత వన్నెలద్దుతున్నాయి.

– ముంచంగిపుట్టు

పెట్టుబడి వచ్చేసింది



డ్రాగన్ ఫ్రూట్ సాగు కలిసొచ్చింది. ఒక్కసారి పెట్టుబడి పెడితే నిలకడగా ఆదాయం పొందవచ్చు. సాగు చేపట్టేందుకు ఎకరాకు రూ.1.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టగా రెండో ఏడాది రూ.2 లక్షల వరకు ఆదాయం వచ్చింది. ఇకనుంచి సుమారు 30 ఏళ్లపాటు నిలకడగా ఆదాయం వస్తుందని ఆశిస్తున్నా. బోరు ఏర్పాటుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

– గుజ్జెల నాగేశ్వరరావు, శాంతినగరం, కొర్రాయి పంచాయతీ, దుంబ్రిగుడ మండలం

పర్యాటకులకు అమ్ముతున్నాం



నా కుమారుడు వేసిన ఈ డ్రాగన్ ఫ్రూట్ పంటలో ఇంటిల్లపాది కష్టపడి పనిచేస్తున్నాం. ప్రాణంతో సమానంగా చూసుకోవడం వల్ల ఏపుగా పెరిగింది. మంచి దిగుబడి వస్తోంది. అంతర పంటగా బంతి నాటడం వల్ల అదనంగా ఆదాయం పొందగలుగుతున్నాం. పర్యాటక ప్రాంతం కావడంతో తోట వద్దకు పర్యాటకులు వచ్చి కొనుగోలు చేయడం వల్ల మేలు జరుగుతోంది.

– గుజ్జెల సీతమ్మ, శాంతినగరం, దుంబ్రిగుడ మండలం

ఆదాయం అధరహో

గిరి రైతు క్షేత్రంలో సిరులు

- అంతర పంటగా బంతి
- అనుకూలించిన వాతావరణ పరిస్థితులు
- ఎకరాకు రూ.2 లక్షల ఆదాయం పొందుతున్న గిరిజన రైతు నాగేశ్వరరావు
- పశువుల ఎరువు వినియోగంతో నాణ్యమైన దిగుబడి
- స్థానికంగానే మార్కెటింగ్
- తప్పిన దళారుల సమస్య

డ్రాగన్ ఫ్రూట్ సాగులో మంచి ఫలితాలు సాధిస్తున్నారు కొర్రాయి పంచాయతీ శాంతినగర్‌కు చెందిన గిరిజన రైతు గుజ్జెల నాగేశ్వరరావు. ఎకరా విస్తీర్ణంలో సాగు చేపట్టిన ఆయన రూ.2 లక్షల మేర ఆదాయం పొందుతున్నారు. అంతర పంటగా బంతి వేయడం వల్ల ఆదనంగా ఆదాయం వస్తోందని ఆయన తెలిపారు. దళారులు, వ్యాపారులపై ఆధారపడకుండా స్థానికంగా అందుబాటులో ఉన్న మార్కెటింగ్ వనరులను సద్వినియోగం చేసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు.



గులాబీ రంగులో డ్రాగన్ పండ్లు



అమ్మకానికి సిద్ధంగా డ్రాగన్ ఫ్రూట్

డ్రాగన్ ఫ్రూట్ సాగులో నిలకడగా ఆదాయం ఆర్జిస్తున్న గిరి రైతు



శాంతి నగర్‌లో ట్రెల్లీస్ విధానంలో డ్రాగన్ ఫ్రూట్ సాగు

దుంబ్రిగుడ: మండలంలోని కొర్రాయి పంచాయతీ శాంతినగర్‌కు చెందిన గిరిజన కుటుంబానికి చెందిన గుజ్జెల నాగేశ్వరరావు డ్రాగన్ ఫ్రూట్ సాగు చేపట్టి మంచి ఆదాయం పొందుతున్నారు. విశాఖ షిప్‌యార్డులో కాంట్రాక్ట్ ఉద్యోగం చేస్తున్న ఆయనకు వ్యవసాయం అంటే ఎంతో ఇష్టం. అయితే అందరిలా కాకుండా ఆయన వినూత్నంగా ఆలోచించారు. ఈ ప్రాంత వాతావరణం అనుకూలంగా ఉన్నందున డ్రాగన్ ఫ్రూట్ సాగుపై దృష్టి సారించారు. గతేడాది ట్రెల్లీస్ పద్ధతిలో జైన్ రకానికి చెందిన రెండు వేల మొక్కలను ఎకరా విస్తీర్ణంలో నాటారు.

ఒకొక్క మొక్క రూ.75..

ఒకొక్క మొక్కను గుంటూరులోని ఓ క్షేత్రంలో రూ.75 చొప్పున కొనుగోలు చేశారు. ట్రెల్లీస్ విధానంలో కీలకమైన సిమెంట్ స్తంభాలు ఒకొక్కటి రూ.350 చొప్పున 500 కొనుగోలు చేశారు. మొత్తమ్మీద మొక్కలు, సిమెంటు స్తంభాలు, కూలి ఖర్చులు కలిపి ఎకరాకు 1.50 లక్షల వరకు పెట్టుబడి అయిందని రైతు తెలిపారు.

- నాటిన తొమ్మిది నెలలకు కాపు మొదలైంది. ఈ ఏడాది పూర్తిగా దిగుబడి వచ్చింది. కిలో రూ.200 చొప్పున విక్రయించగా సుమారు రూ.2 లక్షల వరకు ఆదాయం వచ్చిందని రైతు పేర్కొన్నారు.
- భూమిని సారవంతం చేసేందుకు రసాయన ఎరువులకు బదులుగా పశువుల ఎరువు వినియోగించారు. ఎకరాకు ఐదు ట్రాక్టర్లు గెత్తం వాడినట్టు రైతు తెలిపారు. దీనివల్ల దిగుబడి పెరగడంతో పాటు పండు నాణ్యతగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఒకసారి నాటితే సుమారు 30 సంవత్సరాల వరకు నిలకడగా దిగుబడి వస్తుందని ఆయన వివరించారు.
- ట్రెల్లీస్ విధానంలో సాగు చేపట్టడం వల్ల మొక్కకు గాలి తగిలి ఏపుగా పెరుగుతుంది. మొక్కకు మొక్కకు మధ్య పది అడుగుల పొడవు, 8 అడుగుల వెడల్పు దూరం ఉండాలి. ఒక మొక్క నుంచి సుమారు 20 వరకు పండ్ల దిగుబడి వస్తుందని రైతు తెలిపారు.
- పర్యాటక ప్రాంతం కావడం వల్ల మార్కెటింగ్ స్థానికంగా అందుబాటులో ఉంది. అరకు పైనరీ, గిరిజన మ్యూజియంతో పాటు స్థానిక మార్కెట్లో విక్రయించడం వల్ల దళారుల ప్రభావం లేదని రైతు తెలిపారు. దీనివల్ల ఆయన మంచి ఆదాయం పొందగలుగుతున్నారు.
- అంతరపంటగా ముద్దబంతి సాగు చేపట్టారు. దీనిపై ఏటా అక్టోబర్, నవంబర్‌లో వచ్చే ఆదాయం తోట నిర్వహణ ఖర్చులకు సరిపోతుందని రైతు తెలిపారు. ఉద్యానవనశాఖ ఎకరాకు రూ.13 వేలు పెట్టుబడి సాయంగా అందజేసిందని రైతు తెలిపారు. ఇంటిల్లపాది కష్టపడి పనిచేయడం వల్ల ఏటా నిర్వహణ ఖర్చులు తగ్గడం వల్ల రెండో ఏడాది మంచి ఆదాయం వచ్చిందని రైతు నాగేశ్వరరావు వివరించారు.

సాగును ప్రోత్సహిస్తాం



డ్రాగన్ ఫ్రూట్ సాగు చేపట్టే రైతులకు అవసరమైన ప్రోత్సాహం అందిస్తున్నాం. ఉద్యానవన శాఖ తరఫున ఎకరాకు రూ.13 వేల చొప్పున ఆర్థిక సాయం పొందవచ్చు. అయితే ఈ ఏడాది ఎటువంటి నిధులు మంజూరు కాలేదు. వ్యవసాయ, ఉద్యానవన శాఖల ద్వారా సాగునీటి బోర్లు మంజూరైతే తప్పనిసరిగా డ్రాగన్ ఫ్రూట్ రైతులకు కేటాయిస్తాం.

– కె.శిరీష, ఉద్యానవనశాఖ అధికారి, దుంబ్రిగుడ

సంగీతం భగవదత్తం



- నేను ప్రకృతి ప్రేమికురాలిని
- కాలానుగుణంగా మార్పులు సహజం
- పాటలను ప్రేమించేవారికి కొదవ లేదు
- సుమధుర గాయని సునీత



సంగీత ప్రపంచంలో ఆమె స్వరం మధురం. శ్రోతల హృదయాల్లో ఆమె పాటలు ఎప్పటికీ పదిలం. ఏ పాట పాడినా.. ఏ భావం పలికినా.. స్పష్టమైన ఉచ్ఛారణ ఆమె వరం. భయానకం, కరుణ, వీరత్వం, హాస్యం.. ఇలా సన్నివేశం ఏదైనా సరే దానికి ఆమె గళం తోడైతే ఇక ఆ పాట.. ఆమాట ఓ అద్భుతం అనాల్సిందే. పాటల ప్రపంచంలో తనకంటూ ఒక ప్రత్యేకతను, గుర్తింపును సునీత సంపాదించుకుంది. విశాఖకు వచ్చిన ఆమె సాక్షితో ముచ్చటించారు. – ఏయూక్యాంపస్

నాకు కొండలు, సముద్రం అంటే ఎంతో ఇష్టం, నేనొక ప్రకృతి ప్రేమికురాలిని. నిజంగా చెప్పాలంటే ప్రకృతి మధ్యలో దూర ప్రాంతాలకు ప్రయాణం చేయడానికి కూడా ఎంతో ఇష్టపడతాను. విశాఖకు వచ్చే సమయంలో విమానంలోంచి చూస్తే కొండలు, పక్కనే సముద్రం ఎంతో అందంగా కనిపించాయి.

సంగీతాన్ని ప్రేమించాలి

సంగీతం అనేది భగవదత్తంగా రావాలి. నేర్చుకుంటే జ్ఞానం వస్తుంది. స్వరం మాత్రం జన్మతహా వస్తుంది. సంగీతాన్ని భక్తి గా, శ్రద్ధగా స్వీకరించాలి. సంగీతాన్ని ప్రేమించాలి. నేటి తరం గాయకులకు ఇవే లక్షణాలు ఉండాలన్న నిబంధనలు లేవు. ఎవరు పాడినా తక్కువ సమయంలో పేరుప్రఖ్యాతులు తెచ్చుకునే పరిస్థితులు ఉన్నాయి.

నేను అదృష్టవంతురాలిని

చాలా కాలంగా పాటలు పాడటం వలన అనేక వైవిధ్యమైన పాటలు పాడే అవకాశం కలిగింది. అనేకమంది సంగీత దర్శకులు ఈ ప్రయాణంలో నన్ను ప్రోత్సహించారు. నా ముందుతరం వారు పాడిన కొన్ని పాటలు వింటుంటే కొన్ని సార్లు ఫీలైన సందర్భాలు ఉన్నాయి. ఇంతమంచి పాట నేను పాడలేకపోయాను అనే భావన కలిగింది.

విశాఖలో బంధువులున్నారు

మా అమ్మవాళ్లది విశాఖ. చిన్న తనం నుంచి అమ్మ ఈ నగరం గురించి చెబుతుంటే విశాఖపట్నం ఇలా ఉంటుందా అని ఊహించుకునే దాన్ని. అమ్మ చిన్నతనం ఇక్కడే సాగింది. అమ్మ చెప్పినవి వింటూ ఊహల్లో పెరిగాను. ఆ విధంగా విశాఖ నగరంపై ప్రేమ పెరిగింది. నా ఊహలకంటే ఎంతో అందంగా విశాఖ ఉంది. కైలాసగిరి, రుషికొండ మీద నుంచి నగరాన్ని చూడటం, కొండ పక్కనుంచి వెళ్లే రహదారి చూడటానికి ఎప్పటికీ కొత్తగానే అనిపిస్తాయి. మా పెద్దమ్మ వాళ్లు విశాఖలో ఉండేవారు. ప్రకృతి అంతా ఇక్కడే ఉందని అని అనిపిస్తోంది. విశాఖ ప్రజలు ఎంతైనా అదృష్టవంతులు.

పరిధి పెరిగింది

నేడు సంగీత ప్రపంచం పరిధి విస్తరించింది, సినిమాల్లో పాత్ర, సంగీత దర్శకుడి ఆసక్తి, పరిస్థితులు ఆధారంగా పాటలు పెట్టడం జరుగుతోంది. సంగీతం నేర్చుకోవడం, గాయకులుగా స్థిరపడటంతో పాటు ఈ రంగంలో స్థానాన్ని నిలుపుకోవడం ఎంతో అవసరం.

ఇండిపెండెంట్ మ్యూజిక్‌కు ఆదరణ

కాలంతో పాటు మార్పుల్లో భాగంగా ఇండిపెండెంట్ మ్యూజిక్‌కి ఆదరణ, ప్రాముఖ్యత పెరిగింది. నేను కూడా దీనిలో భాగం అవుతున్నాను. సంగీత కార్యక్రమాలకు వచ్చే ప్రేక్షకులు సంఖ్య మాత్రం పెరుగుతూనే వస్తోంది. ఇది చాలా సంతోషాన్నిచ్చే అంశం.

న్యూస్‌రీల్

వెయిట్ లిఫ్టింగ్‌లో మధుచందన ప్రతిభ

- బంగారు పతకం సాధన



చింతూరు: కృష్ణా జిల్లా గుడివాడలో రెండు రోజుల పాటు జరిగిన 68వ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో చింతూరు కేజీబీవీ విద్యార్థిని గుత్తుల మధుచందన బంగారు పతకం సాధించింది. వెయిట్‌లిఫ్టింగ్ అండర్–19 విభాగం 87 ప్లస్ కేటగిరీలో ఆమె ప్రతిభ కనబరిచింది. వచ్చేనెల 9 నుంచి 15 వరకు ఢిల్లీలో జరిగే 68వ జాతీయస్థాయి స్కూల్‌గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఆమె ఎంపికైంది. ఈ సందర్భంగా ఆమెను కోచ్ గంగాధర్‌తో పాటు స్థానికులు అభినందించారు.

21 నుంచి 'గైస్'లో జాబ్‌మేళా

ముర‌ళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్(గైస్)లో ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.వెంకటరమణ తెలిపారు. ప్రతిష్ఠాత్మకమైన ఎంఆర్‌ఎఫ్ సంస్థలో 18 నుంచి 25 ఏళ్ల వయసు మధ్య గల డిగ్రీ, డిప్లమో, ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు(పురుషులు) ఆపరేటింగ్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 21, 22వ తేదీల్లో డిగ్రీ లేదా డిప్లమో పూర్తి చేసిన అభ్యర్థులకు, ఈ నెల 23, 24 తేదీల్లో 10వ తరగతి, ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఎంపికైన డిగ్రీ లేదా డిప్లమో అభ్యర్థులకు మొదటి సంవత్సరం రూ.19,500, రెండవ సంవత్సరం రూ.20,500, మూడవ సంవత్సరం రూ.21,500 స్టైఫండ్ చెల్లించనున్నారు. సర్వీస్ పెరిగే కొద్దీ వేతనం పెరుగుతుంది. ఉద్యోగం చేస్తూ మాస్టర్ డిప్లమో సర్టిఫికెట్ పొందే అవకాశం ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు. 10వ తరగతి, ఐటీఐ పూర్తి చేసిన వారికి మొదటి సంవత్సరం రూ.18,000, రెండవ సంవత్సరం రూ.18,500, మూడవ సంవత్సరం రూ.19,000 స్టైఫండ్ చెల్లిస్తారు. అభ్యర్థులు రెజ్యూమ్‌తో పాటు ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలు, ఆరు పాస్ పోర్టు సైజు ఫొటోలు, విద్యార్హతకు సంబంధించి జిరాక్స్ కాపీలు తీసుకురావాలని, ఒరిజినల్స్ చూపించాలని ప్రిన్సిపాల్ సూచించారు. ప్రయాణ రాయితీ, క్యాంటీన్ సదుపాయంతో పాటు కంపెనీ నిబంధనలను అనుసరించి వసతి కూడా ఏర్పాటు చేస్తారు. 2018–24 మధ్య ఉత్తీర్ణులైన వారు మాత్రమే ఈ ఇంటర్వ్యూలకు అర్హులు.

మన్యంలో అరకు అందాలు ప్రత్యేకం


- పార్వతీపురం మన్యం కలెక్టర్ శ్యాంప్రసాద్
- ఎంతగానో ఆకట్టుకున్నాయని ప్రశంస



కొత్తపల్లి జలపాతం వద్ద కుటుంబ సభ్యులతో పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్



కాఫీ హౌస్ వద్ద పార్వతీపురం మన్యం కలెక్టర్ ఎం.శ్యాంప్రసాద్ దంపతులతో పైనరీ సిబ్బంది



అరకు పైనరీ వద్ద పార్వతీపురం మన్యం కలెక్టర్ ఎం.శ్యాంప్రసాద్ దంపతులు

దుంబ్రిగుడ: మన్యంలో అరకు అందాలు ప్రత్యేకమని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎం. శ్యాంప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన కుటుంబ సభ్యులతో అరకు పైనరీని సందర్శించారు. మేనేజర్ శేఖర్ వారికి ఘన స్వాగతం పలికారు. పైనరీలో వనాల అందాలను తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అరకులోయ ప్రాంతంలో అద్భుత ప్రదేశాలు ఎన్నో ఉన్నాయన్నారు. తమను ఇక్కడి అందాలు ఎంతగానో ఆకట్టుకున్నాయని తెలిపారు. పైనరీని పరిశుభ్రంగా ఉంచిన ఉద్యోగులు, సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దంపతులతో సిబ్బంది ఫొటోలు దిగారు. అనంతరం అరకులోయలో గిరిజన మ్యూజియాన్ని కుటుంబ సభ్యులతో కలెక్టర్ సందర్శించారు.

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతాన్ని ఆదివారం పాడేరు సబ్‌కలెక్టర్ శౌర్యమన్ పటేల్ కుటుంబసభ్యులతో సందర్శించారు. ఈ ప్రాంతంలో ప్రకృతి అందాలను తిలకించారు. సుందరీకరణ పనుల వివరాలను తెలుసుకున్నారు.

ఉపాధ్యాయ ఓటర్ల దరఖాస్తుల పరిశీలన

మహారాణిపేట(విశాఖ): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటు నమోదు కోసం సమర్పించిన దరఖాస్తులను శరవేగంగా అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ నెల 6వ తేదీ వరకు ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి మొత్తం 17,404 దరఖాస్తులు వచ్చాయి. ఆన్‌లైన్ ద్వారా 4,802, ఆఫ్‌లైన్ ద్వారా 12,602 దరఖాస్తులు స్వీకరించారు. ఈ దరఖాస్తులను ఈ నెల 20వ తేదీ వరకు పరిశీలిస్తారు. 23న ఓటర్ల నమోదుపై డ్రాఫ్ట్‌ను ప్రచురిస్తారు. ఈ డ్రాఫ్ట్ పబ్లికేషన్ మీద 23 నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో 19,523 మంది ఓటర్లే ఉన్నారు. ప్రస్తుత ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ పదవీ కాలం వచ్చే ఏడాది మార్చి 29 నాటితో పూర్తవుతుంది.

దరఖాస్తులు ఇలా..

జిల్లా	ఆన్‌లైన్	ఆఫ్‌లైన్	మొత్తం
విశాఖ	1,252	2,093	3,345
శ్రీకాకుళం	2,072	2,392	4,464
విజయనగరం	555	3,273	3828
పార్వతీపురం మన్యం	340	1,796	2,136
అల్లూరి సీతారామరాజు	212	1,537	1,749
అనకాపల్లి	371	1,511	1,882

నక్క దాడిలో నలుగురి రైతులకు గాయాలు

రాజవొమ్మంగి: మండలంలోని వాతంగి శివారులో పొలం పనులకు వెళ్లిన నలుగురు రైతులపై శనివారం సాయంత్రం నక్క దాడి చేసింది. ఈ ఘటనలో మణి, నాగేశ్వరరావు, రాంబాబు, మల్లేష్ గాయపడ్డారు. పొదలమాటున ఉండి వారిపై దాడి చేసినట్టు గ్రామస్తులు తెలిపారు. సాధారణంగా మనుషులను చూస్తే నక్క పారిపోతుందని, పిచ్చి నక్క అయితేనే దాడికి దిగుతుందని వారు పేర్కొన్నారు.




కురిడి వద్ద వలిసె పూల తోటలో పర్యాటకుల సందడి



అరకు పైనరీ వనాల్లో సందర్శకులు



చెరువులవేనం వ్యూపాయింట్ వద్ద పర్యాటకుల రద్దీ



అరకు పైనరీ ముఖద్వారం వద్ద పర్యాటకుల సందడి

వీకెండ్ సందడి

దుంబ్రిగుడ: మండలంలోని పర్యాటక ప్రాంతాలు సందర్శకులతో కిటకిటలాడాయి. అరకుసంత, జైపూర్ జంక్షన్, రైల్వే గేటు, కురిడి, పంతలచింత, అంత్రిగుడ ప్రాంతాలను సందర్శించిన అనంతరం చాపరాయిలో స్నానాలు చేశారు. అంజోడాలోని అరకు పైనరీని తిలకించారు. గత ఆదివారం చాపరాయి జలవిహారిని మూడు వేల మంది సందర్శించగా 1.31 లక్షల ఆదాయం వచ్చింది. ఈ ఆదివారం నాలుగువేల మంది సందర్శించగా 1.51లక్షల ఆదాయం వచ్చిందని నిర్వాహకులు తెలిపారు.



కొత్తపల్లి జలపాతం వద్ద పర్యాటకుల సందడి

హుకుంపేట: అత్యంత ఎత్తైన శిఖరంగా గుర్తింపు పొందిన సీతమ్మ పర్వతం(జెండాకొండ)పర్యాటకుల రాకతో సందడిగా మారింది. శనివారం సాయంత్రం ఓలుబెడ్డ గ్రామానికి చేరుకున్న వారు అక్కడ నుంచి కాలినడకన కొండపైకి చేరుకున్నారు. రాత్రి గుడారాల్లో బస చేశారు. వేకువజామున సూర్యోదయం అందాలను తిలకించారు. తేనెపట్టు గుహలు, ధింసారాళ్ల వద్ద సందడి చేశారు.

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతానికి ఆదివారం దూరప్రాంతాల నుంచి పర్యాటకులు ప్రత్యేక వాహనాల్లో భారీగా తరలివచ్చారు. జలపాతంలో స్నానాలు చేస్తూ సందడి చేశారు. ఆటపాటలతో రోజంతా ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. కబాబులు, బొంగు చికెన్ అమ్మకాలు భారీగా జరిగాయి.

చింతపల్లి: ప్రముఖ పర్యాటక కేంద్రం లంబసింగికి ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. చెరువులవేనం వ్యూపాయింట్ నుంచి మంచు అందాలను తిలకించారు. తాజంగి జలాశయం వద్ద బోటు షికారు, జిప్ లైనింగ్ ఎక్కి ఎంజాయ్ చేశారు.

అరకులోయ టౌన్: ప్రముఖ పర్యాటక కేంద్రం అరకులోయకు ఆదివారం పర్యాటకుల తాకిడి నెలకొంది. మంచు సోయగాలను తిలకించారు. మాడగడ సన్‌రైజ్ వ్యూపాయింట్ వద్దకు తెల్లవారుజాము 4 గంటల నుంచి సందర్శకులు రాక మొదలైంది. గిరి మహిళల థింసానృత్యాలను తిలకించారు. వారితో చిందేసి సందడి చేశారు. బొర్రా గుహలు, పద్మాపురం ఉద్యానవనం, గిరిజన మ్యూజియానికి భారీగా పర్యాటకులు తరలివచ్చారు.



చాపరాయి జలపాతానికి తరలివచ్చిన పర్యాటకులు



చాపరాయి వద్ద కిక్కిరిసిన వాహనాలు



సీతమ్మపర్వతంపై సందడి చేస్తున్న పర్యాటకులు

క్లుప్తంగా

6న గాయని సునీత లైవ్ కాన్సర్ట్



కార్యక్రమ పోస్టర్‌ను విడుదల చేస్తున్న సునీత, నిఖిల్ తదితరులు

ఏయూక్యాంపస్: నగరంలో డిసెంబర్ 6న లైవ్ కాన్సర్ట్ నిర్వహిస్తున్నట్లు సినీ నేపథ్య గాయని సునీత తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. ఎంజీఎం మైదానంలో ఆరోజు సాయంత్రం ఈ కార్యక్రమం ఉంటుందని, సముద్ర తీరంలో మంచి పాటలతో కార్యక్రమం నిర్వహించాలన్న తన చిరకాల కోరిక తీరబోతోందన్నారు. ప్రిజం క్లబ్, సీసెసెట్టర్స్ భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశాఖలో తనకు ఇదే తొలి లైవ్ కాన్సర్ట్ అని, ప్రజలంతా పాల్గొనాలని కోరారు. నటుడు నిఖిల్ విజయేంద్ర సింహా, ప్రణీత్ పారేపల్లితో కలిసి కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

నవజాత శిశువుల ఆరోగ్యంపై అవగాహన

ఏయూక్యాంపస్: దేశంలో ఏటా మూడు మిలియన్ల మంది శిశువులు నెలలు నిండకుండానే జన్మిస్తున్నారని వైద్య నిపుణులు తెలిపారు. వరల్డ్ ప్రీమెట్యూరిటీ డే సందర్భంగా రెయిన్‌బో చిల్డ్రన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం బీచ్‌రోడ్‌లో అవగాహన నడక నిర్వహించారు. కాళీమాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు జరిగిన ఈ కార్యక్రమంలో ఆస్పత్రి నియోనాటాలజిస్ట్ పి.బాల శ్రీ లత మాట్లాడారు. నెలలు నిండకుండా జన్మించే శిశువుల విషయంలో ఎంతో జాగ్రత్త వహించాలని సూచించారు. శిశువు బరువు కిలో కంటే తక్కువ ఉన్న వారికి కూడా చికిత్స అందించినట్లు చెప్పారు. డాక్టర్ వి.సతీష్ మాట్లాడుతూ అత్యాధునిక నవజాత శిశు సంరక్షణ సదుపాయాలు నేడు అందుబాటులో ఉన్నాయన్నారు. 37 వారాల కంటే తక్కువ సమయంలో జన్మించే వారిని ప్రిమేచ్యూర్ బేబీలుగా పరిగణిస్తారన్నారు. ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా నిర్ణీత సమయం కంటే ముందుగా జన్మించిన శిశువులలో ఎక్కువ మంది ఐదేళ్ల వయసులోపు మరణిస్తున్నారని, వీరిని నియోనేటల్ ఇంటెన్సివ్ కేర్‌లో కంటికి రెప్పలా కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఆర్.రవి చంద్రన్, వైద్యులు, నగర పౌరులు వివిధ కళాశాలల విద్యార్థులు, జాతీయ సేవా పథకం వలంటీర్లు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

మాడుగులలో రేపు జాబ్ మేళా

అనకాపల్లి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 19న నిరుద్యోగ యువతీ యువకులకు మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు సంస్థ జిల్లా అధికారి ఎన్.గోవిందరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్మీడియెట్, డిగ్రీ విద్యార్హత గల 18 నుంచి 35 సంవత్సరాలు లోపు వయస్సు గల నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7981102224 అనే ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

వాల్తేరులో వణుకు



'ఈయన మంచి డీఆర్ఎం.. మాకు టెండరు కావాలని అడిగితే.. ఎంతిచ్చినా తీసుకొని ఆ పనులు మాకే వచ్చేటట్లు చూసేవాళ్లు. అలాంటి మంచివ్యక్తిని సీబీఐ పట్టుకోవడమేంటి సార్..?"

రైల్వే సంబంధిత పనులు చేపట్టే ఓ కాంట్రాక్టర్ చెప్పిన వ్యాఖ్యలివి.. సదరు కాంట్రాక్టర్.. తనకు రావాల్సిన పనులు ఆగిపోతాయేమోనన్న ఆందోళనతో చెప్పినా.. వాల్తేరు డీఆర్ఎం వ్యవహారమేంటనేది ఈ వ్యాఖ్యలే స్పష్టం చేస్తున్నాయి.

వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్‌కుమార్ ప్రసాద్.. ముంబైలో శనివారం ఉదయం లంచం తీసుకుంటూ సీబీఐకి పట్టుబడిన విషయం తెలిసిందే. డీఆర్ఎంపై దర్యాప్తు బృందం దాడితో వాల్తేరు డివిజన్ రైల్వే అధికారులు, ఉద్యోగులు ఉలిక్కి పడుతున్నారు. డీఆర్ఎం వ్యవహారాలు చక్కబెట్టే ఉద్యోగులు తమ పరిస్థితేంటనే ఆందోళనలో ఉన్నారు.

- లంచాలకు అలవాటుపడిన డీఆర్ఎం
- ప్రతి టెండర్‌కు పచ్చనోటు ఇవ్వాల్సిందే
- రెండేళ్ల నుంచి డీఆర్ఎంపై నిఘా పెట్టిన సీబీఐ
- ఆది నుంచీ లంచాల ఆరోపణలే..
- సరైన సమయం కోసం ఎదురు చూసిన వైనం
- సీబీఐ విసిరిన వలలో చిక్కుకున్న సౌరభ్‌కుమార్
- ఉలిక్కిపడిన డీఆర్ఎం వ్యవహారాల్ని చూసే ఉద్యోగులు

సాక్షి, విశాఖపట్నం: వాస్తవానికి.. సీబీఐతో డీఆర్ఎం సౌరభ్‌కు కొత్త పరిచయం కాదని తెలుస్తోంది. గతంలో వాల్తేరు డీఆర్ఎంగా రాకమునుపు సెంట్రల్ రైల్వే జోన్‌లో ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ (పీసీఎంఈ)గా విధులు నిర్వర్తించే వారు. ఈయనకు ముందు పీసీఎంఈగా వ్యవహరించిన అధికారి.. రూ.లక్ష లంచం తీసుకుంటూ సీబీఐకి చిక్కారు. అనంతరం నిర్వహించిన సోదాల్లో రూ.23 లక్షలు, రూ.40 లక్షల విలువైన ఆభరణాలు, రూ.13 కోట్ల విలువైన ఆస్తులు, సింగపూర్, యూఎస్ బ్యాంకుల్లో రూ.1.63 కోట్ల డిపాజిట్లు ఉన్నట్లుగా సీబీఐ అధికారులు గుర్తించారు. ఆయన స్థానంలో పీసీఎంఈగా విధుల్లోకి వెళ్లిన సౌరభ్‌పై అప్పటి నుంచి కేంద్ర దర్యాప్తు బృందం నిఘా పెట్టింది. పలుమార్లు చిక్కినట్లే చిక్కి తప్పించుకున్నట్లు సమాచారం.

వైజాగ్ నుంచి ఫాలో చేస్తూ..

టెండర్ పాస్ చేసేందుకు లంచం అడుగుతున్నారంటూ ఓ కాంట్రాక్టర్ సీబీఐని ఆశ్రయించారు. దీంతో విశాఖ నుంచి దర్యాప్తు బృందం అధికారులు డీఆర్ఎం కదలికలపై నిఘాపెట్టారు. ముంబై వెళ్తున్నట్లు సమాచారం తెలుసుకొని అక్కడ బృందాల్ని అలెర్ట్ చేసినట్లు తెలుస్తోంది. అక్కడ కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకోవడం.. మెర్సిడెస్ కారులో ఇంటికి వెళ్లిన వెంటనే సీబీఐ అధికారులు డీఆర్ఎంను అదుపులోకి తీసుకోవడం చకచకా జరిగిపోయాయి. రెండేళ్ల నుంచి నిఘా కొనసాగించిన సీబీఐ అధికారులకు ఎట్టకేలకు శనివారం చిక్కగా..సీబీఐ అధికారికంగా ఆదివారం వెల్లడించింది.

ఆ ఇద్దరిలో టెన్షన్

డీఆర్ఎంపై సీబీఐ దాడులతో.. డివిజన్‌లో ఉద్యోగుల్లో భయాందోళనలు మొదలయ్యాయి. డీఆర్ఎం వ్యవహారాలు చక్కబెట్టిన ఇద్దరు ఉద్యోగులు.. సెలవుపై వెళ్లిపోయేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అయితే.. సెలవులో వెళ్తే.. సీబీఐ దృష్టిలో పడతారంటూ సహచరులు చెప్పడంతో ఏం చెయ్యాలో పాలుపోక ఎప్పుడు తమని సీబీఐ విచారణకు పిలుస్తారోనంటూ బిక్కుబిక్కుమంటున్నారు.

ఎంతిచ్చినా ఓకే...

లంచం వ్యవహారంలో సౌరభ్ చిక్కడంతో.. ఆయన చేసిన అవినీతి వ్యవహారాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. కాంట్రాక్టర్లతో నిరంతరం..డీఆర్ఎం కార్యాలయం బిజీ బిజీగా ఉండేదని తెలుస్తోంది. సివిల్, మెకానికల్ విభాగాలకు సంబంధించి టెండర్ల ద్వారా వచ్చిన డబ్బుల వసూళ్లకు డీఆర్ఎం కార్యాలయంలోని ఇద్దరు ఉద్యోగుల్ని ప్రత్యేకంగా నియమించినట్లు సమాచారం. టెండర్లు ఎవరికి రావాలంటే.. పని విలువ బట్టి వసూళ్లు రాబట్టేవారని వాల్తేరు డివిజన్ వర్గాలు చెబుతున్నాయి. రూ.50 వేల నుంచి వసూళ్ల పర్వం మొదలయ్యేదని కొందరు కాంట్రాక్టర్లు వాపోతున్నారు. డబ్బులిచ్చిన వారికే పనులకు సంబంధించిన టెండర్లు దక్కేవనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. డీఆర్ఎం అండ్ కో బ్యాచ్‌పై పలుమార్లు ఉన్నతాధికారులకు కాంట్రాక్టర్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలుస్తోంది.

విశాఖ రైల్వే పరువు తీసేశారు!

వాల్తేరు డివిజన్ చరిత్రలో సీబీఐ దాడుల్లో ఒక ఉద్యోగి, లేదా అధికారి పట్టుబడటం ఇదే మొదటిసారని ఉద్యోగులు చెబుతున్నారు. గతంలో డీఆర్ఎంలుగా వ్యవహరించిన అనూప్‌కుమార్ సత్పతి, చేతన్‌కుమార్ శ్రీవాత్సవ్.. డివిజన్ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించారని.. అనేక సంస్కరణలు తీసుకొచ్చారని అంటున్నారు. ఎక్కడా అవినీతికి తావులేకుండా.. ప్రతి అంశంలోనూ పారదర్శకంగా వ్యవహరిస్తూ.. తప్పు చేసిన ఉద్యోగులను బదిలీలు, సస్పెన్షన్లు చేసేవారని చెబుతున్నారు. సదరు సౌరభ్ వచ్చిన తర్వాత.. ఫిర్యాదులిస్తున్నా పట్టించుకోకుండా వాళ్లతో మిలాఖత్ అయిపోయేవారని కొందరు ఆరోపిస్తున్నారు. మొత్తంగా సీబీఐ వ్యవహారంతో విశాఖ రైల్వే డివిజన్‌పై మచ్చ పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అల్లరి మూక బీభత్సం

- ఆటోలు, బస్సులపై దాడి
- నిందితుల్లో టీడీపీ కౌన్సెలర్ సమీప బంధువు

నర్సీపట్నం: మున్సిపాలిటీ పరిధి బలిఘట్టం మెయిన్ రోడ్డుపై మద్యం మత్తులో అల్లరి మూకలు ఆదివారం సాయంత్రం బీభత్సం సృష్టించారు. స్థానికుల కథనం ప్రకారం టీడీపీ సానుభూతిపరులైన , పెదబొడ్డేపల్లికి చెందిన శివ, గణేష్ మరో నలుగురు వ్యక్తులు మద్యం మత్తులో వీరంగం సృష్టించి, ఆ దారిన వెళ్లే బస్సులు, కార్లు అద్దాల పగులకొట్టి ప్రయాణికులను భయాందోళనకు గురిచేశారు. వేములపూడికి చెందిన ఆటో డ్రైవర్ ఎం.సత్యనారాయణ ప్రయాణికులతో వెళ్తుండగా అడ్డగించి చేయి చేసుకోవడంతో పాటు ఆటోపై దాడి చేశారు. ఈ విషయాన్ని స్థానికులు టీడీపీ నాయకుడు గవిరెడ్డి వెంకట రమణకు చేరవేశారు. సంఘటన స్థలానికి వచ్చిన రమణ వారిని వారించడానికి ప్రయత్నించారు. అయితే మద్యం మత్తులో ఉన్న ఆ ఆరుగురు ఆయనపై తిరగబడ్డారు. నీ అంతూ చూస్తామంటూ హెచ్చరించారు. దీంతో అక్కడ గందరగోళ పరిస్థితి ఏర్పడింది. మద్యం మత్తులో వీరంగం సృష్టించిన వారిలో టీడీపీలో ప్రధాన పాత్ర పోషిస్తున్న ఓ కౌన్సిలర్ సమీప బంధువుతో పాటు మరి కొంత మంది ఉండడం విశేషం. జరిగిన సంఘటనపై టీడీపీ నాయకుడు రమణ పార్టీ నాయకులతో వెళ్లి టౌన్ సీఐ గోవిందరావుకు ఫిర్యాదు చేశారు. తనపై దాడి చేసి చంపబోయారని, ఆటోను ధ్వంసం చేశారని ఆయనతో పాటు ఆటో డ్రైవర్ సత్యనారాయణ లిఖితపూర్వకంగా సీఐకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వీరంగం సృష్టించిన వ్యక్తులపై పలు సెక్షన్లపై కేసు నమోదు చేసినట్టు సీఐ గోవిందరావు తెలిపారు.

సీపీఎస్ రద్దుపై మీనమేషాలు తగదు

- ఏకీకృత సర్వీసుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు
- ప్రభుత్వ తీరుమారకుంటే ఉద్యమాలకు సిద్ధం
- ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి రఘునాథరెడ్డి

విశాఖ విద్య: ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయిలను తక్షణమే చెల్లించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం జరిగిన ఎస్టీయూ ఉత్తరాంధ్ర జిల్లాల ముఖ్య బాధ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 11వ పీఆర్సీ, డీఏ, సరెండర్ లీవ్ బకాయిలు, పీఎఫ్, ఏపీజీఎల్ఐ తుది చెల్లింపులు, రుణాల చెల్లింపులపై ప్రభుత్వం ఇంతవరకు స్పందించకపోవడం శోచనీయమన్నారు. ముఖ్యమంత్రి వెంటనే ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి ఎప్పటిలోగా బకాయిలు చెల్లిస్తారో ప్రకటించాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీ అమలు చేయవలసిన గడువు ఇప్పటికే 17 నెలలు ఆలస్యమైందని.. వెంటనే 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించి పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాల భారం తగ్గిస్తామన్న ప్రభుత్వం ఆచరణలో చూపడం లేదన్నారు. పాఠశాలలో అమలు చేస్తున్న బోధనేతర కార్యక్రమాలు, యాప్‌లతో ఉపాధ్యాయులకు మానసిక ప్రశాంతత కరువైందన్నారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించాలన్న చిత్తశుద్ధి కనిపించడం లేదన్నారు. సీపీఎస్ రద్దు పై అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామన్న ప్రభుత్వం ఆ దిశగా ఇంతవరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులు మెమో నం.57 మేరకు 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింప చేయాల్సి ఉండగా.. ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందన్నారు. 1998, 2008 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయులకు 62 ఏళ్ల పదవీ విరమణ వయసు, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్లస్ టు పాఠశాలలను ప్రారంభించి ఉపాధ్యాయులను మాత్రం నియమించలేదన్నారు. పురపాలక ఉన్నత పాఠశాలల్లో ఎస్జీటీ తత్సమాన పోస్టులను వెంటనే ఉన్నతీకరించాలన్నారు. డీఎస్సీ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలపై, ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల ఆర్థిక బకాయిలపై ప్రభుత్వం స్పందించకపోతే ఎస్టీయూ ఆధ్వర్యంలో ఉద్యమానికి శ్రీకారం చుడతామన్నారు. రాష్ట్ర కార్యదర్శి డి.శ్యాం, ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దేముడు బాబు, ఇమంది పైడిరాజు, రమణమూర్తి, తమ్మినాయుడు, కె.జోగారావు, సూరిబాబు, రవి, పరదేశి, వరలక్ష్మి, పురుషోత్తం, సీనియర్ నాయకులు జగదీష్ బాబు పాల్గొన్నారు.

ఊరు వీడింది.. బంధం తెగింది

అభివృద్ధి అగమ్యగోచరం



వాగు అడ్డంకిగా ఉన్న పాత గ్రామం ఎర్రగొండపాకల



అధికారి ఆలోచనతో నిర్మించిన వీరపాండ్యపురం



మూడో గ్రామమైన గంపలగూడెం

చింతూరు: మండలంలోని ఎర్రగొండపాకలలో 54 కుటుంబాలుండగా 182 మంది జనాభా ఉన్నారు. ప్రధాన రహదారి నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఈ గ్రామముంది. గ్రామంలో వెళ్లేందుకు ఇక్కడున్న వాగు దాటాల్సిందే. గ్రామాభివృద్ధికి ఈ వాగు అడ్డంకిగా మారింది. గ్రామానికి కాలినడకనే వెళ్లాల్సిన పరిస్థితి. వర్షాకాలం వచ్చిందంటే గ్రామానికి రాకపోకలు నిలిచిపోతున్నాయి.

అధికారి ముందుచూపు

ఉమ్మడి రాష్ట్ర హయాంలో భద్రాచలం ఐటీడీఏ పీఓగా పనిచేసిన వీరపాండ్యన్ గ్రామంలోని కొండరెడ్లు పడుతున్న కష్టాలను చూశారు. దీంతో ఆయన ఆ గ్రామాన్ని వేరే సురక్షిత ప్రాంతంలో ఏర్పాటుకు యోచించారు. ఈ మేరకు చింతూరు, మారేడుమిల్లి ప్రధాన రహదారి పక్కన స్థలం సేకరించి కొన్ని ఇళ్ల నిర్మాణంతో పాటు కమ్యూనిటీ హాల్‌ను నిర్మించారు. కొన్ని కుటుంబాలు అక్కడికి తరలివచ్చారు. గ్రామస్తులు ఆ గ్రామానికి వీరపాండ్యపురంగా నామకరించారు. అయితే గ్రామాన్ని అభివృద్ధి చేయాలని భావించిన పీవో వీరపాండ్యన్ బదిలీ కావడంతో గ్రామం తరలింపు ఎక్కడికక్కడ నిలిచిపోయింది. అనంతరం వచ్చిన అధికారులు పట్టించుకోక పోవడంతో పాటు రాష్ట్ర విభజనతో ఈ గ్రామం గురించి ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. గ్రామస్తుల కష్టాలు తొలగించాలని భావించిన ఆ అధికారి బదిలీ గ్రామ స్వరూపాన్నే మార్చేసింది.

చెల్లాచెదురైన కుటుంబాలు : కొత్తగా నిర్మించిన వీరపాండ్యపురానికి పాత గ్రామానికి చెందిన కేవలం ఐదు కుటుంబాలు మాత్రమే వచ్చి నివాసముంటున్నారు. గ్రామానికి చెందిన 15 కుటుంబాలు ఈ రెంటికీ నడుమ గంపలగూడెం పేరుతో మరో గ్రామం ఏర్పాటు చేసుకుని ఇళ్లు నిర్మించుకున్నారు. పాత గ్రామం ఎర్రగొండపాకలలో ప్రస్తుతం 34 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఊరు మూడు ప్రాంతాలుగా చీలిపోవడంతో గ్రామస్తులు, కుటుంబాలు చెల్లాచెదురయ్యాయి.

ఆలోచన కార్యరూపం దాల్చలేదు



తమ కష్టాలు గట్టెక్కాలని అప్పటి పీవో వీరపాండ్యన్ ఈ ఆలోచన చేసి గ్రామాన్ని నిర్మించారు. అందరూ రాకపోవడంతో ఆయన ఆలోచన కార్యరూపం దాల్చలేదు. పాత గ్రామానికి చెందిన అందరూ ఇక్కడికి వచ్చి ఉంటే వీరపాండ్యపురం ఇంకా అభివృద్ధి జరిగి వుండేది.

– సొదుల రామిరెడ్డి, వీరపాండ్యపురం

అభివృద్ధి అంతంత మాత్రమే



అందరూ కలిసికట్టుగా ఉండే మేమంతా మూడు ఊర్లుగా విడిపోవడం చాలా బాధగా ఉంది. కుటుంబ సభ్యులు, బంధువులు విడిపోయి తలోచోట ఉండాల్సి వస్తోంది. మా గ్రామాల్లో అభివృద్ధి కూడా అంతంత మాత్రంగానే ఉంది.

– చదల బుచ్చిరెడ్డి, ఎర్రగొండపాకల

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి



కళాకారుల నృత్యం

తరలివచ్చిన ప్రముఖ కళాకారులు

ఏయూక్యాంపస్: భారతీయ నృత్య వైభవానికి ప్రతీకగా పరంపర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య ప్రదర్శన నిలిచింది. ప్రముఖ స్టెప్ డ్యాన్స్ సంస్థతో బీచ్‌రోడ్డులోని ఎం.జి.ఎం పార్క్ ఆవరణలో నిర్వహించిన ఈ నృత్యోత్సవం విశాఖ వాసులను సంభ్రమాశ్చర్యానికి గురిచేసింది. రెండు వేల సంవత్సరాల పూర్వపు భారతీయ నృత్య కళను ఆధునిక భావాలను మేళవిస్తూ చేసిన ప్రదర్శలు ఆద్యంతం కట్టి పడేశాయి. కార్యక్రమంలో కలెక్టర్ హరేందిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి కార్యక్రమాన్ని ఆద్యంతం తిలకించి, కళాకారులను అభినందించారు. పరంపరా ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్రీ నాగి బి. రావు, శశిరెడ్డిలు మాట్లాడుతూ సంప్రదాయ కళారూపాలను ఆధునిక కాలంలో ఏవిధంగా ప్రాముఖ్యతను సంతరించుకుంటున్నాయో ప్రజలకు తెలియజేయడం తమ లక్ష్యమన్నారు. శ్రీరామ జననం నుంచి రావణ వధ వరకు రామాయణ ఘట్టాన్ని వేదికపై ఎంతో హృద్యంగా ఆవిష్కరించిన విధానం అద్భుతంగా సాగింది. సౌత్ ఇండియాలోని శిల్పకళ నుంచి స్ఫూర్తిని స్వీకరిస్తూ యోగ, కథక్ నృత్యాలను మేళవించి, రెండు వేల సంవత్సరాల క్రితం నాట్య శాస్త్ర పుస్తకాలలో జ్ఞానాన్ని జోడించి చేసిన శివతాండవం ప్రజలు కైలాసంలో ఉన్నామనే భావనకు గురిచేసింది. మరొక నృత్యంలో పంచభూతాలను అనుసంధానం చేస్తూ మండల ఉషస్సు నృత్యం భారతీయ వారసత్వం, సంస్కృతిని ఆవిష్కరించింది. 75 ఏళ్ల భారతీయ స్వాతంత్ర్య సంబరాలను పురస్కరించుకుని రూపకల్పన చేసిన రాప్సిడి నృత్యం భారతీయ స్వాతంత్ర్యయోధుల కృషిని కళ్లకు కట్టింది. క్రీడలను నృత్యానికి జోడించి చేసిన నృత్యం కళాకారుల ప్రతిభకు, భారతీయ నృత్య వైశిష్ట్యానికి మచ్చుతునకగా నిలచింది. చివరగా ప్రదర్శించిన సంజోక్ అవరోధాలు లేని భారతీయ నృత్య ప్రాభవాన్ని చాటింది. స్టెప్ డ్యాన్స్ సంస్థ నిర్వాహకురాలు మధు నటరాజన్ వ్యాఖ్యానం, కళారూపాలను వివరించిన విధానం ప్రత్యేకంగా నిలచాయి.

నకిలీ నోట్ల చలామణి ముఠా అరెస్ట్



చిల్డ్రన్ బ్యాంక్ పేరుతో ముద్రించిన నోట్లు

పరవాడ: లంకెలపాలెం ప్రాంతంలో నకిలీ కరెన్సీని చెలామణి చేస్తున్న నలుగురిని పరవాడ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు అందించిన వివరాలివీ.. కోనసీమ జిల్లా ముమ్మిడివరానికి చెందిన గుత్తుల విశాల్.. అతని మామయ్య శీలం శ్రీనుతో కలిసి ఈ నెల 16న వ్యానులో కొబ్బరి బొండాల లోడుతో బయలుదేరాడు. ఎస్ఏడీ కొత్త రోడ్డులో ఆదివారం తెల్లవారుజామున 3.30 గంటలకు అన్‌లోడ్ చేశారు. తిరుగు ప్రయాణంలో లంకెలపాలెం కూడలిలో టీ తాగడానికి సాయంత్రం 4.30 గంటలకు ఆగారు. ఆ సమయంలో అక్కడకు అనకాపల్లి మండలం విజయరామరాజపేటకు చెందిన ఒమ్మి భానుప్రకాష్, వై.ఆదర్శ్, పెదరెల్లి వీధికి చెందిన పాట్నూరు హరిచంద్రప్రసాద్, విజయనగరం జిల్లా రాజాం మండలం బురడకు చెందిన తీగల క్రాంతికుమార్ వచ్చారు. రూ.500 నోటుకు చిల్లర అడిగారు. అది నకిలీ నోటు అని గమనించక విశాల్ చిల్లర ఇచ్చాడు. ఇదే అదనుగా భావించిన ఆ వ్యక్తులు మరో నాలుగు నకిలీ రూ. 500 నోట్లు ఇచ్చి చిల్లర ఇవ్వమని కోరగా.. వాటికి కూడా విశాల్ చిల్లర ఇచ్చాడు. వెంటనే ఆ నలుగురు అక్కడి నుంచి జారుకున్నారు. అనంతరం విశాల్ ఆ నోట్లను పరిశీలించగా.. చిల్డ్రన్ బ్యాంకు ఆఫ్ ఇండియా అని ముద్రించి ఉండటం గమనించాడు. వెంటనే పరవాడ పోలీసులను ఆశ్రయించాడు. సీఐ ఆర్.మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఎస్ఐ బి.కృష్ణారావు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆ నలుగురిని మంత్రిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో సాయంత్రం అరెస్టు చేశారు. ఆరు నకిలీ రూ.500 నోట్లు, 20 అసలు రూ.100 నోట్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

పర్యాటక ప్రాంతంలో రహదారి పనులు



మాడగడ వ్యూ పాయింట్ వద్ద జరుగుతున్న పనులు

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.13 కోట్ల నిధులు మంజూరు
- సన్‌రైజ్ వ్యూ పాయింట్ వద్ద రోడ్డు, డ్రైనేజీ, రిటైనింగ్ వాల్ పనులు

అరకులోయటౌన్: ప్రముఖ పర్యాటక కేంద్రం ఆంధ్రా ఊటి అరకులోయ పరిసర ప్రాంతాల్లోని ప్రముఖ సందర్శిత ప్రాంతాల అభివృద్ధికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్ద పీట వేసింది. ఇందులో భాగంగానే అరకులోయ మండలంలోని మాడగడ సన్ రైజ్ వ్యూ పాయింట్‌కు బోసుబెడ నుంచి సన్‌రైజ్ వ్యూపాయింట్ వరకు రహదారి నిర్మాణానికి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కె. రోజా రూ. 13 కోట్లు నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతం పనులు శరవేగంగా సాగుతున్నాయి. మూడేళ్ల క్రితం మాడగడ సన్‌రైజ్ వ్యూపాయింట్ వెలుగులోకి వచ్చింది. నాటి నుంచి రోజు రోజుకు ఇక్కడికి పర్యాటకుల తాకిడి పెరుగుతూ వస్తోంది. మన రెండు తెలుగు రాష్ట్రాల పాటు ఇతర రాష్ట్రాల నుంచి వందలాది సంఖ్యలో పర్యాటకులు రావడంతో తీవ్ర ట్రాఫిక్ సమస్య తలెత్తేది.

వ్యూ పాయింట్‌కు వెళ్లెందుకు సరైన రహదారి సౌకర్యం లేదని, డబుల్ రోడ్డు, డ్రైనేజీలు, రిటైనింగ్ వాల్స్ నిర్మించాల్సిన అవసరం ఉందని అరకులోయ మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అప్పటి పర్యాటక శాఖ మంత్రి రోజా దృష్టికి సమస్యను తీసుకు వెళ్లారు. స్పందించిన మంత్రి రోజా నిధులు మంజూరు చేసి, వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ఎన్నికల కోడ్ ఇతరత్రా కారణాల వల్ల నిలిచిపోయిన ప్రస్తుతం జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే వాహనచోదకులు, పర్యాటకుల సమస్య తీరుతుందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక ఆదాయం

మాడుగుల రూరల్: ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం పొందవచ్చని జాతీయ నూనె గింజల అభివృద్ధి సంస్థ సంయుక్త కార్యదర్శి అజిత్ కుమార్ సాహూ తెలిపారు. మండలంలోని చింతలూరులో ఆయిల్‌పామ్ తోటలను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయిల్‌పామ్ రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు పూర్తి స్థాయిలో మెలకువలు తెలుసుకుని, సాగు విస్తీర్ణం పెంచాలని సూచించారు. సాగుకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థికసాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పల్లం, మెట్ట భూముల్లో పంటను వేసుకోవాలని, ఆయిల్ పామ్ ధర క్రమేపి పెరుగుతోందని చెప్పారు. గ్రామ, మండల స్థాయి ఉద్యానవన, వ్యవసాయాధికారులు ఈ పంటపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా సాగు చేయడం వల్ల అధిక ఆదాయం వస్తుందన్నారు. ఆయన వెంట ఐఏఎస్ అధికారులు ఎం.రఘునందన్‌రావు, కె. పోన్నుస్వామి, ఏపీ ఉద్యానవనశాఖ అదనపు డైరెక్టర్ కె.బాలాజీ నాయిక్, జిల్లా ఉద్యానవనశాఖాధికారి జి.ప్రభాకర రావు, జిల్లా మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు అధికారి జి.వి. లక్ష్మి, మండల ఉద్యానవనశాఖాధికారి వి.భాను పుష్పలీలావతి తదితరులున్నారు. అనంతరం బంగారు మెట్టలో గల ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని సందర్శించారు.